క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

లింగాల: మండల కేంద్రంలో శనివారం మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ అప్పలనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వీధి లైట్లు ఏర్పాటు చేస్తున్నారని, ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

రికార్డులు పరిశీలన

కోడేరు: విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని కాంప్లెక్స్ హెచ్‌ఎం ఆంజనేయులు ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మండలంలోని నర్సాయిపల్లి, బాడిగదిన్నె, మైలారం, ఎత్తం పీఎస్ పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రతి విద్యార్థి పాఠశాలకు వచ్చేలా చూడాలన్నారు. విద్యార్థుల హాజరు శాతం ఎఫ్‌ఆర్‌ఎస్‌లో నమోదు చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండేలా చూడలాని వంట ఏజెన్సీలకు సూచించారు. రికార్డులు పరిశీలించారు.

ఉద్యోగుల నిరసన

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని సింగోటం గ్రామ ఉన్నత పాఠశాల ఆవరణలో జీఓ 28 ప్రతులను దహనం చేసి ఉపాధ్యాయులు, ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర సీపీఎస్‌ఈయూ సహ అధ్యక్షుడు బృంగి కృష్ణప్రసాద్ మాట్లాడారు. ఉద్యమాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో బాధిత సీపీఎస్ ఉద్యోగులతో కాని, ఉద్యోగ సంఘలతో కాని ఎలాంటి సంప్రదింపులు జరపకుండా మేము కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంలోనే కొనసాగుతామంటూ ఆగస్టు 23, 2014న విడుదలైన జీఓ నం 28 ద్వారా ఆనాటి తెలంగాణ ప్రభుత్వం దుర్మార్గపు పద్ధతిలో ఉద్యోగుల జీవితాలను కాలరాసిందన్నారు. ఆగస్టు 23ను పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తున్నామన్నారు. గోవిందు గౌడ్, షఫీ, పార్వతి శివ పాల్గొన్నారు.

అగ్రికల్చర్ అధికారులకు సన్మానం

పెంట్లవెల్లి: మండల పరిధిలోని గోపులాపురంలో మండల అగ్రికల్చర్ అధికారులకు ఏఈఓలకు గ్రామస్తులు సన్మానం చేశారు. కొన్ని సంవత్సరాలుగా గోపులాపూర్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఈఓ కురుమూర్తి బదిలీపై వెళ్లగా.. అదే గ్రామానికి ఏఈఓగా వచ్చిన విష్ణుకి ఆ గ్రామస్తులు, రైతులు కలిసి శాలువాలు, పూలమాలలతో సత్కరించి సన్మానించారు.

అభివృద్ధికి కృషి చేయాలని వినతి



పెంట్లవెల్లి: పెంట్లవెల్లి మండలంలోని జెడ్పీహెచ్ఎస్ బాయ్స్ హైస్కూల్‌లో కొద్ది రోజుల కిందట కురిసిన వర్షానికి ప్రధాన రోడ్డుపై పారుతున్న వర్షపునీరు పాఠశాల ఆవరణలో నిలిచిపోయింది. దీంతో ఆ పాఠశాల ఆవరణ చెరువులా కనిపిస్తుంది. సమస్య పరిష్కరించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది స్థానిక ఎంపీడీఓ ప్రభాకర్‌కు వినతి అందజేశారు.

అన్ని రంగాల్లో రాణించాలి

తాడూరు: విద్యార్థులు తరగతి గదికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో రాణించాలని మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన రాకెట్ నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు శాస్త్రసాంకేతిక రంగాల్లో, సాంస్కృతిక, మేధాశక్తి కలిగి అన్ని రంగాల్లో ప్రతిభ కనబర్చాలన్నారు. విద్యార్థులు పీఎస్ఎల్‌వి, ఏఎస్ఎల్‌వి, జీఎస్ఎల్‌వి, రాకెట్ నమూనాలు, చంద్రయాన్, మంగళయాన్ ఉపగ్రహ నమూనాలను తయారు చేసే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

సేవలు చిరస్మరణీయం

నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): ఉద్యోగ బదిలీ అందరికీ సాధారణంగా ఉంటుందని, కానీ వారు చేసిన సేవలే చిరస్మరణీయంగా ఉంటాయని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.రవికుమార్ నాయక్ అన్నారు. శుక్రవారం బిజినేపల్లి మండలంలోని లట్టుపల్లి పీహెచ్‌సీలో బాధ్యతలు నిర్వహిస్తున్న భీమయ్య, పుష్పలత, కిష్టమ్మ, పద్మ ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. వైద్య అధికారులు డా.ఆలోచన, శ్రీకాంత్, సురేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నల్లమల వాసికి డాక్టరేట్

అమ్రాబాద్: పదర మండలం వంకేశ్వరానికి చెందిన బరుపటి శ్రీశైలం ఆస్ట్రాలజీ విభాగంలో పీహెచ్‌డీ పట్టా అందుకున్నాడు. రాజస్తాన్‌లోని ఉదయపూర్ మహర్షివేదిక్ ఆస్ట్రాలజీ కళాశాలలో తన ప్రతిభతో నవగ్రహాలు మానవులపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతాయనే అంశంపై పరిశోధనా చేసి ఈ పట్టా అందుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు. ప్రతిభ కనబరిచిన శ్రీశైలానికి శుక్రవారం కళాశాల తరఫున డాక్టరేట్ అందజేశారని వివరించారు.



బ్యాంకు చుట్టూ ప్రదక్షిణ



బ్యాంకు సిబ్బందితో గొడవ పడుతున్న రైతులు

- మూడేళ్ల నుంచి రుణాలు ఇవ్వకపోవడంతో ఆందోళన చెందుతున్న రైతులు

పెద్దకొత్తపల్లి: పెద్దకార్పాములని పంజాబ్ నేషనల్ బ్యాంకులో పంట రుణం కోసం మూడేళ్ల నుంచి 50 మంది రైతులు బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా.. అధికారులు రుణాలు ఇవ్వడంలేదు. దీంతో వారు శుక్రవారం బ్యాంకు ఎదుట ఆందోళన చేపట్టారు. పెద్దకార్పాములకి చెందిన 15 మంది రైతులు అంబటిపల్లి, రాయవరం, యాపట్ల గ్రామాలకు చెందిన 35 మంది రైతులకు మూడేళ్ల కిందట బ్యాంకులో పంట రుణం ఇస్తామని అధికారులు రైతుల వద్ద పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లు బ్యాంకు ఖాతా బుక్ జిరాక్స్‌ను ఇతర బ్యాంకుల్లో రుణాలు లేనట్లు నో డీవ్ సర్టిఫికెట్లు తీసుకున్నారు. గతంలో బ్యాంకులో పనిచేసిన బ్యాంకు మేనేజర్లు ప్రతి ఏటా వర్షాకాలంలో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు వానాకాలం పంట రుణం ఇస్తామని అప్పుడూ, ఇప్పుడు అంటూ కాలయాపన చేస్తూ.. వచ్చారు. గతేడాది బదిలీ అయి



పెద్దకార్పాములలోని పంజాబ్ నేషనల్ బ్యాంకు

పోయిన మేనేజర్ పార్లమెంట్ ఎన్నికల తరువాత రైతులకు పంట రుణాలు అందిస్తామని 50 మంది వద్ద అన్ని ధ్రువపత్రాలు తీసుకుని రుణం ఇవ్వకుండా మూడు నెలల కిందట బ్యాంకు నుంచి బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేపట్టడంతో బ్యాంకు అధికారులు రుణమాఫీ అయిన వారికి వారి ఖాతాల్లో మాఫీ డబ్బులను జమ చేసేందుకే సమయం తీసుకుంటున్నారు. కొత్త రైతులకు రుణాలు ఇచ్చేందుకు ఆసక్తి చూపడంలేదు. దీంతో రైతులు బ్యాంకు అధికారులతో గొడవకు దిగారు. దీంతో అధికారులు స్పందించి, మాఫీ అయిన రైతుల రుణాలు పూర్తయిన వెంటనే కొత్త రుణాలు ఇస్తామని రైతులకు తెలియజేశారు.

మూడేళ్ల నుంచి తిరుగుతున్నా..



నాకు ఎకరా 10 గుంటల భూమి ఉంది. పంజాబ్ నేషనల్ బ్యాంకులో పంట రుణం కోసం మూడేళ్ల నుంచి బ్యాంకు చుట్టూ తిరిగితే రుణం కోసం ఫారాలు తీసుకున్న బ్యాంకు అధికారులు.. అప్పుడూ ఇప్పుడు అంటూ కాలయాపన చేస్తున్నారు.

– కాశ్ల యాదయ్య, రైతు పెద్దకార్పాముల

పత్రాలు తీసుకున్నారు.



బ్యాంకు అధికారులు మూడేళ్ల కిందట పంట రుణం కోసం అవసరమున్న పత్రాలను తీసుకున్నారు. పంట రుణం అడిగితే అప్పుడు ఇస్తాం, ఇప్పుడు ఇస్తాం అని కాలయాపన చేసి ఇప్పటి వరకు రుణం ఇవ్వలేదు.

– కాశ్ల రాజు, రైతు పెద్దకార్పాముల

కొత్త రుణాలు ఇస్తాం..

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసింది. రుణమాఫీ అయిన రైతులందరికీ డబ్బులను రైతులు చెల్లించిన తరువాత అక్టోబర్‌లో కొత్త రైతులకు పంట రుణాలు ఇస్తాం.

– ఓం కుమార్, పంజాబ్ నేషనల్ బ్యాంకు మేనేజర్, పెద్దకార్పాముల

వాహనాల తనిఖీ

తాడూరు: మండల కేంద్రం పోలీస్‌స్టేషన్ ఎదుట ప్రధాన రోడ్డుపై ఎస్ఐ మహేష్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడుపరాదని లైసెన్స్ కచ్చితంగా కలిగి ఉండాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని వాహనదారులకు వివరించారు. నంబర్ ప్లేట్ కనిపించేలా ఉండాలని, మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఏఎస్ఐ స్వామి, సిబ్బంది భాస్కర్, నర్సింహ ఉన్నారు.

సాగు నీరు ఇవ్వాలి

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని ఎన్మన్‌బెట్లలోని వీరమనాయిని చెరువుకు కేఎల్ఐ ప్రాజెక్టు నుంచి సాగు నీరు ఇవ్వాలని సీపీఎం మండల నాయకులు సురేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన గ్రామంలో రైతులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గ్రామానికి జీవనాధారం అయిన వీరమనాయిని చెరువుకు కేఎల్ఐ ప్రాజెక్టు నుంచి సాగు నీరు ఇవ్వడంలో స్థానిక పాలకులు విఫలమయ్యారన్నారు.నీరు విడుదల చేయకుంటే ఈ నెల 27 నుంచి తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేస్తామన్నారు.

లక్ష్యాలను నిర్దేశించుకుని చదవాలి



అమ్రాబాద్: విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని చదవాలని ప్రముఖ సైకాలజిస్టు శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం అమ్రాబాద్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, బాలికల కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో నైపుణ్యం పెంచుకోవాలని వివరించారు.

బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి

నాగర్‌కర్నూల్ రూరల్: తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో జరగబోయే మంత్రివర్గ విస్తరణలో రాష్ట్ర హోం శాఖ, విద్యాశాఖతో పాటు పీసీసీ అధ్యక్ష పదవిని కూడా బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కాశ్ల నిరంజన్, రవీందర్‌గౌడ్, సుధాకర్‌గౌడ్, లక్ష్మయ్య, కొట్ర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చెత్తను వేర్వేరుగా ఇవ్వాలి

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీ చెత్త బండిలో తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సిబ్బందికి అందించాలని ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ శివ కాలనీవాసులకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని విద్యానగర్ కాలనీలో కాలనీవాసులకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. చెత్తనంతా ఒకే దగ్గర కలపటంతో దోమలకు నిలయంగా మారటంతో పాటుగా, పలు అనారోగ్యాలకు దారితీస్తుందని తెలియజేశారు. స్వరాజ్యలక్ష్మి, శ్రీశైలం, కాలనీ వాసులు గోపాల్, శంకర్, బాలయ్య పాల్గొన్నారు.

నోటుపుస్తకాల పంపిణీ

కల్వకుర్తి రూరల్: మండలంలోని తుర్కలపల్లి ప్రాథమిక పాఠశాలలో వాసవిక్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు, ఇతర సామగ్రి పంపిణీ చేశారు. సంతోష్, ఆంజనేయులు, అశోక్‌కుమార్, రఘు పాల్గొన్నారు.

బస్సు రావడం లేదని ధర్నా

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని ముక్కిడిగుండంలో వారం రోజుల నుంచి వర్షాలు వస్తుండటంతో బస్సు రావడం లేదని నార్లాపూర్‌కి వచ్చిన ఆర్టీసీ బస్సును ఆపి గ్రామస్తులు ధర్నా చేపట్టారు. అందుకు స్పందించిన కొల్లాపూర్ డీఎం శనివారం నుంచి గ్రామానికి బస్సు వస్తుందని చెప్పడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో ముక్కిడిగుండానికి చెందిన రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

చారకొండ: మహిళ సంఘాల సభ్యులకు స్త్రీనిధి రుణాలను బ్యాంకు అందజేస్తుందని, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలో రైతువేదిక కార్యాలయంలో శుక్రవారం మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళ శక్తి ప్రోగ్రాంలో భాగంగా మహిళల రుణాలు, పాడి పశువులు, పౌల్ట్రీ, పెరటికోళ్ల పెంపకంపై లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ, ఏపీఎం మాట్లాడారు. స్త్రీనిధి నుంచి మహిళలు ఎలాంటి సబ్సిడీ లేకుండా ఎంచుకున్న యూనిట్‌కు వెంటనే సంబంధిత రుణం మంజూరవుతుందన్నారు. సమావేశంలో వెటర్నరీ డాక్టర్ శివకుమార్, నర్సింహ, విమల, మాధవి పాల్గొన్నారు.



చారకొండలో మట్లాడుతున్న ఎంపీడీఓ ఇసాక్

మహిళలు ముందంజలో ఉండాలి

తెలకపల్లి: మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని మండల పశువైద్యాధికారి మధు, ఏపీఎం నిరంజన్ అన్నారు. శుక్రవారం తెలకపల్లిలోని స్త్రీశక్తి భవనంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పర్వతాపూర్, వట్టిపల్లి, తెలకపల్లి, కార్వంగ, బండపల్లి, దాసుపల్లి, పెద్దూరు, బోరబండతండా గ్రామాల నుంచి మహిళలు పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం గేదెలు, ఆవులు పెంపకంపై మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు.

ఊర్కొండ: మండల కేంద్రంలోని రైతువేదికలో శ్రీనిధి మేనేజర్ చందు ఆధ్వర్యంలో మండల మహిళా అవగాహన సదస్సు నిర్వహించారు. స్త్రీనిధి ద్వారా మహిళలకు లోన్లు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీపీఎం స్పెషల్ ఆఫీసర్ నర్సింహ, రాజేష్ పాల్గొన్నారు.

ఇళ్లలో చోరీ

లింగాల: మండలంలోని అంబట్‌పల్లి కృష్ణారెడ్డి ఇంట్లో చోరీ జరిగింది. మూడున్నర తులాల బంగారం, రూ.96,500 నగదు అపహరణకు గురైనట్లు ఎస్ఐ జగన్‌మోహన్ శుక్రవారం తెలిపారు. ఇంటి వారు బంధువుల ఫంక్షన్‌కు హైదరాబాద్ వెళ్లారని, ఇది గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని ఎస్ఐ తెలిపారు. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మగ్దూంపూర్ చౌరస్తాలో..

మండల కేంద్రానికి సమీపంలోని మగ్దూంపూర్ చౌరస్తాలోని కేతావత్ కృష్ణ వ్యాపారం నిర్వహిస్తున్న డబ్బాలో గురువారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు రూ.2 వేల నగదు, సీసీ కెమెరాను ఎత్తుకెళ్లారని తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

కొనసాగుతున్న మొలకల పండుగ

అచ్చంపేట: అచ్చంపేట గిరిజన భవన్ ఆవరణలో తీజ్ ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఏడో రోజు శుక్రవారం చడోక్లి ధూండ్ ఆటలు ఆడారు. ఉత్సాహంగా ఊయలలు ఊగుతూ సంప్రదాయ నృత్యాలు ప్రదర్శించారు. మేరమ్మ దేవతకు, సంత్ సేవాలాల్ మహారాజ్‌లకు ప్రత్యేక పూజలు చేశారు. నియమ నిష్టలతో ఉన్న గిరిజన యువతలు తీజ్ బుట్టలకు నీళ్లు పోసి ప్రత్యేక పూజలు చేశారు. తీజ్ ఉత్సవ కమిటీ, గిరిజన సేవా సంఘం, గిరిజన ఉద్యోగుల సంఘం, గిరిజన విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు దాతల సహకారంతో నిత్య అన్నదానం చేస్తున్నారు.



తీజ్ ఉత్సవాల్లో సంప్రదాయ నృతాలు చేస్తున్న గిరిజన మహిళలు, యువతులు

మైనార్టీల ఆధ్వర్యంలో ర్యాలీ

నాగర్‌కర్నూల్ క్రైం: కోల్‌కత్తా వైద్యవిద్యార్థి అత్యాచార ఘటనను నిరసిస్తూ.. జిల్లా కేంద్రంలో శుక్రవారం ముస్లింల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. దేశంలో మహిళలకు భద్రత లేకుండా పోయిందని అన్నారు. వైద్య విద్యార్థి అత్యాచార ఘటనపై సమగ్ర విచారణ జరిపించి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

తెలకపల్లి: అత్యాచారానికి పాల్పడిన నిందితులను శిక్షించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కిరణ్‌కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు దేశమోని ఆంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని గౌరెడ్డిపల్లిలో విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. ఆంజనేయులు, ప్రేమ్‌కుమార్, సూర్యశంకర్ పాల్గొన్నారు.

కారకులను శిక్షించాలి

కల్వకుర్తి రూరల్: కోల్‌కతాలోని మెడికల్ కళాశాలలో జూనియర్ డాక్టర్ అత్యాచారానికి కారకులైన వారిని శిక్షించాలని డాక్టర్ గంగాధర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆల్ ఇండియా డెమోక్రటిక్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ 2వ జిల్లా మహాసభలు కల్వకుర్తిలో నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి యూటీఎఫ్ భవనం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి విద్యార్థి సంఘం అఖిలభారత సెక్రెటరీ సభ్యుడు గంగాధర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అధికార యంత్రాంగం నిందితులను కాపాడే చర్యలు చేపట్టడం బాధాకరమన్నారు. అనంతరం నాగర్‌కర్నూల్ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



తెలకపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

అంబులెన్స్‌లో ప్రసవం

అమ్రాబాద్: మండల కేంద్రానికి చెందిన ఇశ్రాత్‌బేగం పురిటి నొప్పులతో బాధపడుతూ అమ్రాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చింది. అక్కడ ఉన్న సిబ్బంది ఇక్కడేమి చేయలేమని అచ్చంపేట వెళ్లాలని సూచించారు. వారె 108 అంబులెన్స్‌ను పిలిపించి అచ్చంపేటకు తరలించారు. నొప్పులు అధికం కావడంతో ఈఎంటీ నాగేష్, పైలెట్ బషీర్ అంబులెన్స్‌లోనే ప్రసవం చేశారు.

డీసీసీబీ చైర్మన్‌కు సన్మానం

పెద్దకొత్తపల్లి: మహబూబ్‌నగర్ డీసీసీబీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డిని కొత్తపేట సింగిల్‌విండో అధ్యక్షుడు కట్టా రాజేందర్‌గౌడ్, పెద్దకొత్తపల్లి సింగిల్ విండో అధ్యక్షుడు బుడుగు శ్రీనివాస్ యాదవ్ శుక్రవారం విష్ణువర్ధన్‌రెడ్డిని శాలువా, పూల మాలలతో సన్మానించారు.

పరిశోధనలో భాగస్వాములు కావాలి

కల్వకుర్తి టౌన్: విద్యార్థులు వారి పాఠశాల స్థాయి నుంచే పరిశోధనల్లో భాగస్వాములు కావాలని ప్రభుత్వ మాడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.శ్రీపాద శార్వాణి అన్నారు. శుక్రవారం కళాశాల ప్రాంగణంలో జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా కళాశాల విద్యార్థులతో కలిసి సైన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు సైతం అంతరిక్ష స్థాయిలో నిర్వహించే పరిశోధనలో పాల్గొనేలా వారి వ్యూహాలు ఉండాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం 2024 ఎమ్మెస్సీ పీజీ విభాగంలో రాష్ట్ర స్థాయి 12, 61లతో పాటుగా 100లోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటుగా, కళాశాల లెక్చరర్లు అభినందించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వాణి, భౌతిక శాస్త్ర లెక్చరర్ శ్యాంసుందర్, లెక్చరర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలు అందజేసిన ప్రిన్సిపాల్

అర్హులందరికీ రుణమాఫీ

అమ్రాబాద్: అర్హులందరికీ ప్రభుత్వం పంట రుణాల మాఫీ చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హరినారాయణగౌడ్ తెలిపారు. శుక్రవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వివిధ కారణాలు, సాంకేతిక కారణాలతో కొంత మంది రైతులకు రుణమాఫీ జరగలేదని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

మాట నిలబెట్టుకున్న ప్రజా ప్రభుత్వం

బల్మూర్: ఏక కాలంలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీపతి రావు, గిరివర్ధన్‌గౌడ్, రాంప్రసాద్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు

ఉప్పునుంతల: ప్రతిపక్ష పార్టీల నాయకులు కేవలం రాజకీయ దురుద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సంక్షేమ పథకాల అమలులో పూర్తిగా అవినీతి జరిగిందని ఆరోపించారు.

నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): బీఆర్ఎస్ పార్టీ చేసిన మోసాలను ప్రజలు గుర్తుపెట్టుకుని అసెంబ్లీ ఎన్నికల్లో ఒడించడమే కాకుండా ఎంపీ ఎన్నికల్లో ఒక సీటును కూడా దక్కనివ్వకుండా చేశారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్ బహదూర్, దానం బాలరాజ్ అన్నారు. శుక్రవారం తిమ్మాజీపేట మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పార్టీ ఉనికి కోసమే రైతుల పేరుతో పోరాటాలు చేస్తున్నారన్నారు. లక్ష్మీనారాయణ, మాధవులు పాల్గొన్నారు.

ఉచిత సౌకర్యం కల్పించాలి

కొల్లాపూర్: ఆర్టీసీ బస్సుల్లో స్త్రీలతో పాటు పురుషులకు కూడా ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని బీఆర్ఎస్ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్టీసీ బస్సుల్లో సీట్ల పరిమితికి మించి మహిళలు ఎక్కుతున్నారన్నారు. దీంతో పురుషులకు కూర్చునేందుకు సీట్లు కూడా దొరకడం లేదన్నారు. టికెట్ కొనేవారికి ఖచ్చితంగా సీటు కేటాయించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మహేష్, రాజు, ప్రవీణ్, నవీన్ తదితరులున్నారు.

కేసు నమోదు

అచ్చంపేట: పట్టణంలోని టంగాపూర్ కాలనీలో శుక్రవారం పేకాట ఆడుతున్న ఐదుగురు పేకటారాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాములు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేయగా.. పట్టుబడ్డారని, వీరి నుంచి రూ.12 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

ఎస్ఐకి సన్మానం

చారకొండ: ఇటీవల ఎస్ఐ వెంకట్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మండలంలోని గోకారానికి చెందిన కాంగ్రెస్ మండల నాయకులు, మాజీ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, కొండల్ శుక్రవారం స్టేషన్‌లో మార్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించారు.

నాయకుల సంతాపం

కొల్లాపూర్: పట్టణంలోని ఒకటో వార్డుకు చెందిన రిటైర్డ్ టీచర్ కె.చంద్రారెడ్డి(78) శుక్రవారం ఉదయం మృతిచెందగా.. ఆయన మృతదేహానికి టీపీసీసీ సభ్యులు రంగినేని జగదీశ్వరుడు, బీఆర్ఎస్ నాయకులు నరేందర్‌రెడ్డి పూల మాలలు వేసి నివాళి అర్పించారు.

తీగలు తెగిపడి..

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రానికి చెందిన రైతు నరేందర్ తన వ్యవసాయ పొలంలో జెర్సీ ఆవును కట్టేశాడు. గురువారం రాత్రి కురిసిన వర్షానికి చెట్లు కూలి విద్యుత్‌వైర్లపై పడటంతో విద్యుత్ వైర్లు తెగి అక్కడే ఉన్న ఆవుపై పడింది. విద్యుత్‌షాక్‌కు గురై ఆవు అక్కడికక్కడే మృతిచెందింది.

ఆకట్టుకున్న బాలసభ



కల్వకుర్తి: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో వందేమాతరం ఫౌండేషన్ ఆధర్యంలో నిర్వహించిన బాలసభ పలువురిని ఆకట్టుకుంది. ప్రతి నెల చివరి శుక్రవారం విద్యార్థులతో బాలసభ కార్యక్రమం ఏర్పాటు చేస్తారు. విద్యార్థులే సభను ఏర్పాటు చేసుకొని వారే వారి సమస్యలపై చర్చిస్తారు. బాలసభలో భాగంగా విద్యార్థులు డీఈఓ, ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులుగా వ్యవహరిస్తూ, వారిలో భయాన్ని పోగొట్టేందుకు గాను కథలు చెప్పటం, పాటలు పాడటం, నృత్యాలు చేయడం చేస్తారు. ఇలాంటి సభల ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, వారిలో ఉన్న కళా నైపుణ్యాలు వెలికితీయబడతాయని అక్షరజ్యోతి వాలంటీర్లు తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిర్మల, అనూష, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో తపస్ సభ్యత్వ నమోదు

ఉప్పునుంతల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు మండలంలోని కాంసానిపల్లి తదితర పాఠశాలల్లో శుక్రవారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై తపస్ పోరాటాలను ఉపాధ్యాయులకు వివరిస్తూ.. వారితో సభ్యత్వాలు చేయించారు. ఈ సందర్భంగా తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్ ముదిరాజ్ మాట్లాడారు. ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎం పోస్టులను డీఈడీ, బీఈడీ అర్హత కలిగిన ఎస్జీటీలకు ప్రమోషన్ ద్వారా భర్తీ చేయాలని కోరారు. తపస్ జిల్లా కార్యదర్శి జగదీశ్వర్, రాజేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సన్నాహక సమావేశం

లింగాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 68వ ఎస్‌జీఎఫ్‌ఐ మండల స్థాయి క్రీడల నిర్వహణకు శనివారం సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు జీహెచ్‌ఎం బషీర్ అహ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 11 గంటలకు జరిగే సమావేశంలో మండలంలోని ఆయా పాఠశాలలు, ఆశ్రమ, గురుకుల పాఠశాలల హెచ్‌ఎంలు, పీడీలు, పీఈటీలు పాల్గొని క్రీడల నిర్వహణపై సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

నెమలి అప్పగింత

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని ఎర్రగడ్డ కాలనీలో ఉపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్ ఇంటి పరిసరాలకు నెమలిని రావడంతో పట్టుకున్నాడు. అటవీశాఖ రేంజ్ అధికారి దేవరాజ్‌కు అప్పగించగా.. వారు అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

బహిరంగ ప్రకటన

[illegible]

సం/- B. జనార్ధన్ రెడ్డి, అడ్వకేట్

[illegible] ఫోన్: 9848078075

